# తొలివెలుగు

జాతీయ దిన పత్రిక

మన భాష.. మన పత్రిక..

https://tholivelugu.com/

హైదరాబాద్ సంపుటి:01 సంచిక: 28 6-2-2026 వెల: రూ.2/- పేజీలు: 06



విలేకరులు కావలెను

తొలివెలుగు జాతీయ దిన పత్రిక మన భాష.. మన పత్రిక..

www.epaper.tholivelugu.com

Contacts

తెలంగాణ

94911 34365

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో

తొలివెలుగు జాతీయ తెలుగు దినపత్రికలో పలు విభాగాల్లో పనిచేయుటకు ఉత్సాహవంతులైన స్టేట్ బ్యూరో, జిల్లా స్టాఫర్లు, నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు, మండల రిపోర్టర్లు కావలెను. ఆసక్తి.. అనుభవం గల వారు సంప్రదించగలరు.


# కాళేశ్వరంపై సీబీఐ విచారణేమైంది

- ఆరు నెలలైనా ఇంత వరకు అతీ గతీ లేదు
- ఏటీఎం అని విమర్శించిన మోదీ ఎందుకు చర్యలు తీసుకుంటలే
- బీజేపీ, బీఆర్ఎస్ ది వీణావాణి బంధం
- ఎంపీ ఎన్నికల్లో డిపాజిట్లు రాని సన్నాసులు ఎట్ల గెలుస్తరు
- బీఆర్ఎస్ సచ్చి బీజేపీకి అవయవదానం చేసింది
- బీఆర్ఎస్ నుంచి బీజేపీకి ప్రొటెక్షన్ మనీ
- అందుకే కేంద్రం వాళ్ల మీద చర్యల్లేవ్
- బీజేపీ జాతీయ అధ్యక్షుడు గాడిద గుడ్డు తెచ్చిండు
- మూసీకి నిధులివ్వలే.. మెట్రో రైల్ కు పైసలివ్వలే
- బీజేపీ ఒక్క మున్సిపాలిటీ అయినా గెలుస్తదా?
- ప్రజాపాలనపై విషం చిమ్ముతున్న బీఆర్ఎస్
- చొప్పదండి సభలో సీఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్/ కరీంనగర్: కాళేశ్వరం కుంభకోణంపై సీబీఐ విచారణ చేయాలని కోరుతూ అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపి ఆరు నెలలైనా ఇంత వరకు అతీ గతీ లేదని సీఎం రేవంత్ రెడ్డి విమర్శించారు. ఎన్నికల సమయంలో రాష్ట్రానికి వచ్చిన ప్రధాని మోదీ, హోం

2లో





## కేసీఆరే జాతిపిత

- రేవంత్ బూతు పిత
- ఆరు గ్యారెంటీలు గల్లంతు
- మహిళలకు ఉచిత ప్రయాణం..
- పురుషులకు డబుల్ చార్జీ
- పథకాలు ఎగ్గొట్టిన సర్కారు గజ్వేల్ లో మాజీ మంత్రి హరీశ్ రావు




2లో

## మోదీపై దాడికి కుట్ర!

- ఆయనను నేనే సభకు రావొద్దన్నా
- విపక్ష ఎంపీలు ప్రధానిని చుట్టుముట్టారు
- కాంగ్రెస్ గందరగోళానికి యత్నించింది
- పార్లమెంటు చరిత్రలోనే ఇదొక మచ్చ
- స్పీకర్ ఓం బిర్లా కీలక వ్యాఖ్యలు

2లో





2లో

## రాజకీయంగా ఎదుర్కోలేకనే జాతి ప్రస్తావన

- వెలమ సామాజిక వర్గాన్ని టార్గెట్ చేయడం సరికాదు
- రేవంత్ అన్న మర్యాదలు అతిక్రమించి మాట్లాడారు
- జగిత్యాల ఎమ్మెల్యేకు క్లీన్ చిట్ రాజ్యాంగ అవమానమే
- సంజయ్ ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలి
- మాజీ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

2లో

## బొగ్గు గని ప్రమాదంపై ప్రధాని మోదీ దిగ్భ్రాంతి...

- మృతుల కుటుంబాలకు నష్ట పరిహారం
- మేఘాలయ బొగ్గు గనిలో పేలుడు, 16 మంది కార్మికులు మృతి
- ప్రమాదంపై ప్రధాని మోదీ తీవ్ర దిగ్భ్రాంతి, పరిహారం ప్రకటన
- మృతుల కుటుంబాలకు రూ. 2 లక్షలు, క్షతగాత్రులకు రూ. 50 వేలు సాయం
- ఘటనపై సమగ్ర విచారణకు మేఘాలయ ప్రభుత్వం ఆదేశం
- బాధ్యులపై కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేసిన సీఎం సంగ్మా

2లో



## ప్రతిపక్ష నేతను మాట్లాడనివ్వండి



- రాహుల్‌పై వ్యాఖ్యలకు జేపీ నడ్డాపై ప్రియాంక ఆగ్రహం
- కేంద్రం ఎం భయపడుతోందో చెప్పాలని ప్రశ్న
- భారత్‌అమెరికా వాణిజ్య ఒప్పందంపై ప్రశ్నించేందుకే అడ్డంకులా అని వ్యాఖ్య



## తిరుమల లడ్డూ వ్యవహారంలో సీబీఐ ఎక్కడా క్లీన్ చిట్ ఇవ్వలేదు

- గత వైసీపీ ప్రభుత్వంపై డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తీవ్ర ఆరోపణలు
- తిరుమల లడ్డూ ప్రసాదంలో నెయ్యికి బదులు పామాయిల్, రసాయనాలు వాడారని వ్యాఖ్య
- అయోధ్య రామమందిర ప్రారంభోత్సవానికి కూడా లక్ష కల్తీ లడ్డూలు పంపారని ఆరోపణ
- గత ప్రభుత్వం దేవుడిపైనే పగబట్టిందని, ఇది హిందువుల మనోభావాలను దెబ్బతీయడమేనని విమర్శ
- ఈ వ్యవహారంలో ఎక్కడా సీబీఐ క్లీన్ చిట్ ఇవ్వలేదని, వాస్తవాలు బయటపెడతామని స్పష్టీకరణ

2లో

## బీజేపీని గెలిపిస్తే రూ.500 కోట్లు తెస్తా

- మా చొరవతోనే పంచాయతీలకు రూ.250 కోట్లు విడుదల
- రెండేళ్ల కాంగ్రెస్ పాలనలో మున్సిపాలిటీలకు
- ఇచ్చింది గాడిద గుడ్డేకేంద్ర మంత్రి బండి సంజయ్



2లో

# రాజకీయంగా ఎదుర్కోలేకనే జాతి ప్రస్తావన

హైదరాబాద్: రాజకీయంగా ఎదుర్కొనే ధైర్యం లేకనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఒక జాతిని టార్గెట్ చేస్తూ మాట్లాడుతున్నారని మాజీ ఎమ్మెల్సీ కవిత విమర్శించారు. ముఖ్యమంత్రి హోదాలో ఉండి అన్ని మర్యాదలను అతిక్రమిస్తూ మాట్లాడటం ఏమాత్రం సరైన పద్ధతి కాదని ఆమె అన్నారు. వెలమ జాతిని ఉద్దేశించి నోటికి వచ్చినట్లు వ్యాఖ్యలు చేయడం తీవ్రంగా తప్పని కవిత పేర్కొన్నారు. సీఎం గా ప్రమాణం చేసిన సమయంలో ఎలాంటి భేదభావం లేకుండా అందరినీ గౌరవిస్తానని రాజ్యాంగంపై ప్రమాణం చేశారని గుర్తు చేశారు. కానీ ఆ ప్రమాణాలను మరిచి ఒక జాతిని టార్గెట్ చేయడం సరికాదని వ్యాఖ్యానించారు.జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కాంగ్రెస్‌లో చేరిన విషయం అందరికీ తెలుసని కవిత చెప్పారు. ముఖ్యమంత్రి సమక్షంలోనే ఆయన కాంగ్రెస్‌లో చేరారని, గాంధీ భవన్‌లో అధికారిక సమావేశాలకు హాజరవుతున్నారని తెలిపారు. జగిత్యాలలో మున్సిపల్ అభ్యర్థులకు కాంగ్రెస్ బీ–ఫారమ్‌లు కూడా ఇచ్చిన వ్యక్తికి స్పీకర్ క్లీన్ చిట్ ఇవ్వడం రాజ్యాంగాన్ని అవమానించడమేనని విమర్శించారు.సంజయ్‌కు నిజంగా నీతి, నిజాయితీ ఉంటే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలని కవిత డిమాండ్ చేశారు. రాజ్యాంగ పరంగా ఉన్న హక్కులను ఒక్కొక్కటిగా తొక్కడం భవిష్యత్ తరాలకు మంచిది కాదని హెచ్చరించారు. స్పీకర్ వెంటనే తమ నిర్ణయాన్ని మార్చుకోవాలని డిమాండ్ చేస్తున్నట్లు ఆమె స్పష్టం చేశారు.

# కేసీఆరే జాతిపిత



గజ్వేల్: కేసీఆర్ జాతిపిత అయితే, రేవంత్ రెడ్డి బూతు పిత అని మాజీ మంత్రి హరీశ్ రావు అన్నారు. వ్యక్తిగత విమర్శలు, బూతులు తప్ప రేవంత్‌కు పాలన చేతకాదని ఆరోపించారు. ఒకప్పుడు పందులతో నిండిన గజ్వేల్ దవాఖాన కేసీఆర్ హయాంలో ఎలా మారిందో ప్రజలకు తెలుసని అన్నారు. రేవంత్ రెడ్డి సీఎం అయ్యాక బంగారం ధర ఎనభై వేల వరకు పెరిగిందని, కానీ ప్రజలకు ఇచ్చిన హామీలు మాత్రం నెరవేర్చలేదని విమర్శించారు. ఉన్న పథకాలను కూడా ఎగ్గొట్టడం తప్ప కొత్తగా చేసిందేమీ లేదన్నారు. ఆడవారికి ఉచిత ప్రయాణమని చెప్పి, మగవారికి డబుల్ టికెట్ వేశారని ఎద్దేవా చేశారు. మనకు అన్నం పెట్టింది, పథకాలు అందించింది కేసీఆరేనని, రెండేళ్లలో మళ్లీ కేసీఆర్ ముఖ్యమంత్రి అవుతారని ధీమా వ్యక్తం చేశారు. కేసీఆర్ జై తెలంగాణ అన్నారని, రేవంత్ రెడ్డి ఒక్కరోజైనా అలా అన్నాడా అని ప్రశ్నించారు. బీజేపీకి అక్షింతలు పంచడం తప్ప గజ్వేల్‌కు ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదన్నారు. గజ్వేల్ బాగుండాలంటే కారు గెలవాలని, బీఆర్ఎస్ కౌన్సిలర్లను భారీ మెజార్టీతో గెలిపించాలని ప్రజలను దండం పెట్టి కోరుతున్నానని, మిగిలిన పనుల బాధ్యత తానే తీసుకుని పూర్తి చేస్తానని హరీష్ రావు అన్నారు.

# ప్రతిపక్ష నేతను మాట్లాడనివ్వండి

ఢిల్లీ: లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీకి మాట్లాడే అవకాశం ఇవ్వాలని కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీ వాద్రా డిమాండ్ చేశారు. పార్లమెంట్ ప్రాంగణంలో మీడియాతో మాట్లాడుతూ, రాహుల్ మాట్లాడితే కేంద్రం ఎందుకు భయపడుతోందని ప్రశ్నించారు. రాహుల్ గాంధీని ఉద్దేశించి కేంద్ర మంత్రి జేపీ నడ్డా చేసిన వ్యాఖ్యలను ప్రియాంక తీవ్రంగా ఖండించారు. ఇలా మాట్లాడడం సరైన పద్ధతి కాదని, ప్రతిపక్షాన్ని నోరు మూయించేందుకు పాలకపక్షం ప్రయత్నిస్తోందని ఆరోపించారు. రాహుల్ గాంధీ పుస్తకంలోని అంశాలను ప్రస్తావిస్తాడన్న ఆందోళనా అని ప్రశ్నించారు. లేదా భారత్‌అమెరికా వాణిజ్య ఒప్పందంపై ప్రశ్నిస్తారనే ఆందోళనా? అంటూ నిలదీశారు. రాజ్యసభలో జేపీ నడ్డా, కాంగ్రెస్ పార్టీని ఒక 'అజ్ఞాన బాలుడి'కు బానిసగా మార్చొద్దంటూ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేకు సూచించారు. దీనిపై రాజ్యసభలో ఖర్గే, బీజేపీ నేతల మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. లోక్‌సభలో రాహుల్ గాంధీకి మాట్లాడే అవకాశం నిరాకరించడాన్ని నిరసిస్తూ ప్రతిపక్షం ఆందోళన కొనసాగిస్తోంది. రాహుల్ గాంధీనికి ఉద్దేశించి నడ్డా చేసిన వ్యాఖ్యలపై ప్రియాంక అభ్యంతరం వ్యక్తం చేశారు.

## బీజేపీని గెలిపిస్తే రూ.500 కోట్లు తెస్త

కరీంనగర్: మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీని గెలిపించిన వెంటనే రూ.500 కోట్ల నిధులు తెస్తానని కేంద్ర మంత్రి బండి సంజయ్ ప్రకటించారు. కరీంనగర్ పార్లమెంట్ పరిధిలోని మున్సిపాలిటీలకు వరదలా నిధులు తీసుకొస్తానని చెప్పారు. హుజూరాబాద్ మున్సిపాలిటీలో బీజేపీ అభ్యర్థులకు మద్దతుగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సీఎస్సార్, ఎంపీ లాడ్స్ నిధులతో సౌకర్యాలు కల్పిస్తానని హామీ ఇచ్చారు. గ్రామ పంచాయతీ ఎన్నికలైనందున కేంద్రం తాజాగా రూ.259 కోట్లు విడుదల చేసిందని తెలిపారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, తాను చొరవ తీసుకోవడంవల్లే ఈ నిధులు విడుదలయ్యాయని చెప్పారు. రెండేళ్ల కాంగ్రెస్ పాలనలో మున్సిపాలిటీలకు గాడిద గుడ్డు మాత్రమే ఇచ్చిందని ఎద్దేవా చేశారు. హుజూరాబాద్ మున్సిపల్ చైర్మన్ పీఠాన్ని బీజేపీకి అప్పగిస్తే ఢిల్లీకి పోయి పెద్ద ఎత్తున నిధులు తీసుకొచ్చి హుజూరాబాద్ పట్టణం రూపురేఖలు మారుస్తానని హామీ ఇచ్చారు. హుజూరాబాద్ లో మినీ స్టేడియం నిర్మాణం కోసం కేంద్రం నుండి నిధులు తీసుకొచ్చినా కాంగ్రెస్ ప్రభుత్వం అడుగడుగునా ఆటంకాలు కల్పించడం వల్ల ఇబ్బందులు ఏర్పడ్డాయన్నారు. ఎన్నికలైన వెంటనే స్టేడియం నిర్మాణం పనులు మొదలుపెట్టేలా చర్యలు తీసుకుంటానని, ఎవరు అడ్డు వస్తారో చూస్తానన్నారు.

# బొగ్గు గని ప్రమాదంపై ప్రధాని మోదీ దిగ్భ్రాంతి...

మేఘాలయలోని ఈస్ట్ జైంతియా హిల్స్ జిల్లాలోని ఓ బొగ్గు గనిలో గురువారం భారీ పేలుడు సంభవించడంతో 16 మంది కార్మికులు ప్రాణాలు కోల్పోవడం తెలిసిందే. ఈ దుర్ఘటనపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు, క్షతగాత్రులకు ప్రధానమంత్రి జాతీయ సహాయ నిధి (గ్రావీచీ=ఖీ) నుంచి ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు. ఈ ఘటనపై సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ఎక్స్ వేదికగా ప్రధాని మోదీ స్పందించారు. "ఈస్ట్ జైంతియా హిల్స్‌లో జరిగిన ప్రమాదం నన్ను కలచివేసింది. ప్రియమైన వారిని కోల్పోయిన కుటుంబాలకు నా ప్రగాఢ సానుభూతి. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలి" అని పేర్కొన్నారు. ప్రమాదంలో మరణించిన వారి కుటుంబాలకు రూ. 2 లక్షలు, గాయపడిన వారికి రూ. 50 వేల చొప్పున ఆర్థిక సహాయం అందిస్తామని ప్రకటించారు. ఈ ప్రమాదంపై మేఘాలయ ముఖ్యమంత్రి కాన్రాడ్ సంగ్మా స్పందిస్తూ, ఘటనపై ప్రభుత్వం సమగ్ర విచారణకు ఆదేశించిందని తెలిపారు. బాధ్యులను గుర్తించి కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన స్పష్టం చేశారు. ప్రజల భద్రత విషయంలో ఎలాంటి రాజీకి తావులేదని, విచారణలో తేలిన అంశాల ఆధారంగా అవ సరమైన అన్ని చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. ఈస్ట్ జైంతియా హిల్స్ జిల్లాలోని థాంగ్‌స్కూ ప్రాంతంలో ఉన్న అనుమానిత అక్రమ బొగ్గు గనిలో ఈ పేలుడు జరిగిందని పోలీసు అధికారులు తెలిపారు. ఇప్పటివరకు 16 మృతదేహాలను వెలికితీసినట్లు జిల్లా ఎస్పీ వికాశ్ కుమార్ ధ్రువీకరించారు. ఘటనా స్థలంలో సహాయక చర్యలు ఇంకా కొనసాగుతున్నాయని ఆయన వివరించారు.

# మీరు చేసింది మహా పాపం...

(మొదటి పేజీ తరువాయి)

ఎదురుదాడి చేస్తున్నారు. ఇది మంచి పద్ధతి కాదు. రాష్ట్రంలోని భక్తులందరికీ ఒక సామాన్య భక్తుడిగా విజ్ఞప్తి చేస్తున్నా. దేవునికి అపచారం జరిగినప్పుడు ముక్తకంఠంతో ఖండించాలి. ఈ దోషులను కఠినంగా శిక్షిస్తాం. ఏకసభ్య కమిషన్ వేసి సమగ్ర విచారణ జరిపిస్తాం. ఇప్పటివరకు ఉన్న నివేదికలన్నీ ఆ కమిషన్ ముందు ఉంచుతాం. అవసరమైతే కోర్టులోనూ అదనపు సమాచారం సమర్పిస్తాం. ఇది దేవుడిచ్చిన బాధ్యత, దైవ కార్యం. ఇలాంటివి పునరావృతం కాకుండా చూస్తాం" అని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. వైసీపీ నేతలకు దేవుడిపై విశ్వాసం లేకపోవచ్చని, కానీ విశ్వాసం ఉన్న కోట్ల మంది భక్తుల మనోభావాలను దెబ్బతీసే హక్కు వారికి లేదని చంద్రబాబు హెచ్చరించారు. "అంతర్వేదిలో రథం తగలబడితే కందిరీగలు కొరికాయని, ఆంజనేయుడి విగ్రహాన్ని పగలగొడితే 'అదో బొమ్మే కదా, ఇంకోటి పెట్టుకోండి' అని అప్పటి పాలకులు ఎంతో గర్వంగా మాట్లాడారు. ఇవన్నీ చేస్తూ, తిరిగి మాపైనే నిందలు వేశారు. విశ్వాసం లేకపోతే దేవుడి జోలికి రావొద్దు. దేవుడి పవిత్రతను దెబ్బతీయడం దుర్మార్గం. చరిత్రలో ఇప్పటివరకు శ్రీ వెంకటేశ్వర స్వామి జోలికి ఎవరూ రాలేదు. బ్రిటిష్ వాళ్లు కూడా స్వామివారి సంప్రదాయాలను గౌరవించి, మరింత అభివృద్ధి చేశారు. అలాంటిది మీరు చేసిన ఈ పని దుర్మార్గమైన అపచారం" అని ఆయన తీవ్రంగా ఖండించారు.

### సీఎంగా బాధ్యతలు చేపట్టగానే ప్రక్షాళన

తాను ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత తొలి ప్రాధాన్యతగా పరిపాలన, దైవ కార్యాల ప్రక్షాళనపై దృష్టి సారించానని చంద్రబాబు వివరించారు. "ముఖ్యమంత్రిగా నా కార్యకలాపాలు ప్రారంభించేందుకు ఒక ప్రిన్సిపల్ సెక్రటరీని నియమించడం నా మొదటి సంతకం. మానవ సేవ కన్నా ముందు మాధవ సేవ ముఖ్యమని భావించి, ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు తిరుమల ప్రక్షాళన కోసం టీటీడీ ఈఓగా శామలరావును నియమిస్తూ రెండో సంతకం చేశాను. ఈ రెండు పనులు పూర్తి చేశాకే ఇతర కార్యక్రమాలు చేపట్టాను" అని ఆయన తెలిపారు.

అనంతరం తిరుమలలో పరిస్థితులను సమీక్షించి, కల్తీ జరుగుతోందన్న అనుమానంతో నెయ్యి శాంపిళ్లను నేషనల్ డెయిరీ డెవలప్‌మెంట్ బోర్డ్ (ఎన్‌డీడీబీ)కు పంపించామని, ఆ నివేదికలోనే కల్తీ వాస్తవాలు బయటపడ్డాయని స్పష్టం చేశారు.

### 2022లోనే నివేదిక.. అయినా తొక్కిపెట్టారు

ఈ కల్తీ వ్యవహారం కొత్తగా బయటపడింది కాదని, 2022లోనే గత వైసీపీ ప్రభుత్వానికి దీనిపై నివేదిక అందిందని చంద్రబాబు సంచలన విషయాలు వెల్లడించారు."2022లో సీఎఫ్టీఆర్ఐ (జఖీ=×) ఇచ్చిన నివేదికలో నెయ్యి కల్తీ జరుగుతోందని చాలా స్పష్టంగా ఉంది. కానీ, ఆ నివేదికను వాళ్లు ఉద్దేశపూర్వకంగా తొక్కిపెట్టారు. యథేచ్ఛగా కల్తీ నెయ్యి సరఫరాను కొనసాగించారు" అని ఆయన ఆరోపించారు. ఇప్పుడు ఏర్పాటైన సిట్ విచారణలో మరింత భయంకరమైన నిజాలు బయటపడ్డాయని, నెయ్యి తయారీలో పామాయిల్, ప్రమాదకర రసాయనాలు, చివరికి జంతువుల కొవ్వు (యానిమల్ ఫ్యాట్) కూడా వాడుతున్నట్లు తేలిందని ముఖ్యమంత్రి తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు.

### గత ఐదేళ్లలో హిందూమతంపై దాడి

గత ఐదేళ్ల వైసీపీ పాలనలో హిందూ దేవాలయాలు, సంప్రదాయాలపై దాడులు పరాకాష్టకు చేరాయని చంద్రబాబు విమర్శించారు. "ఒకప్పుడు ఇదే అసెంబ్లీలో తిరుమల రెండు కొండలే, ఏడు కొండలు కాదని మాట్లాడినప్పుడు మేం వ్యతిరేకించాం. విజయనగరంలో రాముడి విగ్రహం తల నరికివేస్తే, అక్కడికి వెళ్లి వాస్తవాలు తెలుసుకోవాలనుకున్న నాపైనే కేసు పెట్టారు. అంతర్వేదిలో రథం తగలబడితే ఎలుకలు కొరికాయని చెప్పారు. ఆంజనేయుడి విగ్రహాన్ని పగలగొడితే 'అదో బొమ్మే కదా, ఇంకోటి పెట్టుకోండి' అని అప్పటి పాలకులు ఎంతో గర్వంగా మాట్లాడారు. ఇవన్నీ చేస్తూ, తిరిగి మాపైనే నిందలు వేశారు" అని ఆయన మండిపడ్డారు.

## తిరుమల లడ్డూ వ్యవహారంలో సీబీఐ ఎక్కడా క్లీన్ చిట్ ఇవ్వలేదు

ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, గత వైసీపీ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మంది భక్తులు ఎంతో పవిత్రంగా భావించే తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదం తయారీలో గత ప్రభుత్వ హయాంలో భారీ కుంభకోణం జరిగిందని ఆయన ఆరోపించారు. ఈ వ్యవహారం సుప్రీంకోర్టు వరకు వెళ్లినా, ఇందులో సీబీఐ ఎక్కడా క్లీన్ చిట్ ఇవ్వలేదని ఆయన గుర్తుచేశారు. ఈ వ్యవహారంలో దోషులను ఎట్టి పరిస్థితుల్లోనూ వదిలిపెట్టబోమని, భగవంతుడి ముందు వారు మోకరిల్లే వరకు తమ యుద్ధం ఆగదని హెచ్చరించారు. నెయ్యి పేరుతో పామాయిల్, ప్రమాదకరమైన రసాయనాలు వాడి భక్తుల మనోభావాలను, ఆరోగ్యాన్ని దెబ్బతీశారని ఆయన తీవ్రంగా విమర్శించారు. ఈ వ్యవహారంపై మాట్లాడేటప్పుడు తాము అన్ని పరిణామాలను ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నామని, ఈ అంశాన్ని ప్రజల దృష్టికి తీసుకురావడం తన బాధ్యత అని స్పష్టం చేశారు. ఇవాళ ఉండవల్లిలో కూటమి నేతల సమావేశం అనంతరం నిర్వహించిన ప్రెస్ మీట్ లో పవన్ మాట్లాడారు. పవన్ కల్యాణ్ తన ఆరోపణలకు సంబంధించిన గణాంకాలను కూడా మీడియా ముందుంచారు. "తిరుమల తిరుపతి దేవస్థానానికి (టీటీడీ) ఓ నిర్దిష్ట కంపెనీ 59.70 లక్షల కిలోల నెయ్యి సరఫరా చేసినట్లు అధికారికంగా లెక్కలు చూపింది. కానీ, మా వద్ద ఉన్న ఆధారాల ప్రకారం, అదే కంపెనీ 58 లక్షల కిలోలకు పైగా పామాయిల్, దానికి సంబంధించిన ప్లాంట్ బేస్డ్ ఉత్పత్తులను కొనుగోలు చేసింది. అంతేకాకుండా, సుమారు 1.70 లక్షల నుంచి 2 లక్షల కిలోల వరకు రసాయనాలను కూడా కొనుగోలు చేసినట్లు ఆన్ రికార్డ్ ఆధారాలున్నాయి. నెయ్యి సరఫరా చేస్తున్నామని చెప్పి, పామాయిల్, రసాయనాలు కొనుగోలు చేయడం వెనుక ఉన్న మతలబు ఏంటి? ఇది కల్తీ నెయ్యి కాదు, కల్తీ వనస్పతి, కల్తీ పామాయిల్" అని పవన్ వివరించారు. ఈ కుంభకోణం కేవలం తిరుమలతోనే ఆగిపోలేదని, అయోధ్య రామమందిర ప్రాణప్రతిష్ఠ మహోత్సవానికి కూడా ఇక్కడి నుంచి పంపిన లక్ష లడ్డూలు సైతం ఈ కల్తీ నెయ్యితో తయారు చేసినవేనని పవన్ ఆరోపించారు. దేశమంతా ఎంతో పవిత్రంగా జరుపుకున్న కార్యక్రమానికి సైతం కల్తీ లడ్డూలు పంపి హిందువుల మనోభావాలను తీవ్రంగా గాయపరిచారని ఆయన మండిపడ్డారు. గత ప్రభుత్వానికి దేవుడిపై, హిందూ సంప్రదాయాలపై పగ ఉందని, అందుకే ఇలాంటి చర్యలకు పాల్పడ్డారని పవన్ తీవ్రస్థాయిలో విమర్శించారు. "వీరికి ఏడుకొండల స్వామిపై ఎందుకో పగ. ఏడు కొండలు ఎందుకు, రెండు చాలు అన్న చరిత్ర వీరిది. వీరు వ్యక్తులపై, ప్రత్యర్థులపై కాదు, ఏకంగా భగవంతుడిపైనే పగబట్టారు. ఈ కుట్ర వెనుక ఉన్న వారి వారసత్వం, వారి పరంపర ఎలాంటిదో ప్రజలు గమనించాలి. అందుకే ఈ అంశాన్ని సరిదిద్ది, వాస్తవాలను బయటపెట్టాల్సిన అవసరం ఉంది" అని పవన్ కల్యాణ్ వ్యాఖ్యానించారు.

# కాళేశ్వరంపై సీబీఐ విచారణేమైంది

మంత్రి అమిత్ షా కాళేశ్వరం పై విమర్శలు చేశారని, కేసీఆర్ ఏటీఎంలా వాడుకున్నారని అన్నారని ఇప్పుడు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. దాని వెనుక మర్మమేమిటో చెప్పాలని డిమాండ్ చేశారు. దీనిపై కేంద్ర మంత్రులు బండి సంజయ్, కిషన్ రెడ్డి సమాధానం చెప్పాలన్నారు. ఇవాళ కరీంనగర్ జిల్లా చొప్పదండిలో జరిగిన ఎన్నికల ప్రచార సభలో సీఎం మాట్లాడారు.. బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలది వీణావాణి బంధమని అన్నారు. ఎంపీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అవయవదానం చేసి బీజేపీని గెలిపించందన్నారు. ఎంపీ ఎన్నికల్లో డిపాజిట్లు రాని సన్నాసులు మన్సిపల్ ఎన్నికల్లో ఎలా గెలుస్తుందని ప్రశ్నించారు. బీఆర్ఎస్ నుంచి బీజేపీకి ప్రొటెక్షన్ మనీ (మామూళ్లు) వెళ్తున్నాయని అందుకే కేంద్ర ప్రభుత్వం నోరెత్తడం లేదన్నారు. కేటీఆర్ ఫార్ములా ఈ కేసులో ఐఏఎస్ ఆఫీసర్ల మీద చర్యకు పర్మిషన్ ఇవ్వుమని లేఖ రాస్తే పట్టించుకోలేదన్నారు. విదేశీ కార్ల కేసులో కారు పార్టీ కేటీఆర్ ను కాపాడుతున్నది బీజేపీ కాదా..? అని సీఎం ప్రశ్నించారు. బీజేపీకి దమ్ముంటే కాళేశ్వరం కుంభకోణంలో కేసీఆర్, హరీశ్ ను అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ఫార్ములా ఈ లో కేటీఆర్ ను అరెస్టు చేశాకే బీజేపీ వాళ్లు ఓట్లు అడగాలన్నారు. కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ తమ పార్టీ నాయకులందరినీ తీసుకొని రావాలని.. రాష్ట్రంలో ఒక్క మున్సిపాలిటీ అయినా గెలుస్తారేమో చూద్దామని సవాలు విసిరారు.

### ప్రజాపాలనపై విషమెందుకు

రెండేండ్ల క్రితం అధికారంలోకి వచ్చిన ప్రజాపాలనపై బీఆర్ఎస్ నేతలు విషం చిమ్ముతున్నారని సీఎం అన్నారు. ఏం చేశారని ప్రశ్నిస్తున్నారని అన్నారు. 'పదేండ్లు కేసీఆర్ ఏం చేసిండు.. 12 ఏండ్లు మోదీ ఏం చేసిండో లెక్క చెప్పాలె.. రెండేండ్లలో మేం ఏం చేసిన నేను అసెంబ్లీలో లెక్క చెప్త..' అని సీఎం అన్నారు.

### బీజేపీ ఇచ్చింది గాడిద గుడ్డు

బీజేపీ తెలంగాణకు ఇచ్చింది గాడిద గుడ్డేనని సీఎం అన్నారు. నిన్న పాలమూరుకు ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ వచ్చారని, ఆయన ఎలాంటి హామీ ఇవ్వలేదని అన్నారు. మెట్రో రైలుకు, మూసీ ప్రక్షాళనకు నిధుల గురించి మాట్లాడలేదని, పాలమూరు, రంగారెడ్డికి జాతీయ హోదా ఇవ్వలేదని అన్నారు. మహబూబ్ నగర్ కు ఎన్నికల సమయంలో వచ్చిన మోదీ పాలమూరు రంగారెడ్డికి జాతీయ హోదా ఇస్తామని చెప్పి మోసం చేశారని ఆరోపించారు.

# మోదీపై దాడికి కుట్ర!

ఢిల్లీ: ప్రధాని నరేంద్ర మోదీ ప్రసంగానికి ముందు లోక్‌సభ వాయిదా పడటంపై స్పీకర్ ఓం బిర్లా కీలక వ్యాఖ్యలు చేశారు. విపక్ష ఎంపీలు ప్రధాని సీటు చుట్టుముట్టిన నేపథ్యంలో, భద్రతా కారణాల దృష్ట్యా ప్రధాని సభకు రావొద్దని తానే సూచించినట్లు వెల్లడించారు. కాంగ్రెస్ నేతృత్వంలో కొందరు ఎంపీలు సభలో అవాంఛనీయ ఘటనలకు పాల్పడే అవకాశం ఉందన్న విశ్వసనీయ సమాచారం తనకు ముందుగానే అందిందని స్పీకర్ తెలిపారు. ప్రధాని సీటు వద్ద ఏదైనా అనూహ్య ఘటన జరిగితే దేశ గౌరవానికి తీవ్ర భంగం కలిగేదని పేర్కొన్నారు. అందుకే ప్రధాని సభకు రావద్దని సూచించానన్నారు. పార్లమెంట్ చరిత్రలో రాజకీయ విభేదాలను స్పీకర్ కార్యాలయానికి, సభ గౌరవానికి తీసుకురావడం ఎప్పుడూ జరగలేదని ఓం బిర్లా అన్నారు. నిన్న జరిగిన ఘటన పార్లమెంటరీ చరిత్రలో నల్ల మచ్చగా మిగిలిపోతుందన్నారు.లోక్‌సభలో మాజీ సైన్యాధిపతి నరవణే పుస్తకాన్ని ప్రస్తావించడంపై తీవ్ర గందరగోళం నెలకొంది. ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఆ పుస్తకాన్ని ప్రస్తావించడాన్ని కేంద్ర మంత్రులు రాజ్‌నాథ్ సింగ్, అమిత్ షా తీవ్రంగా వ్యతిరేకించారు. తరువాత సభ పునఃప్రారంభమైనప్పుడు బీజేపీ ఎంపీ నిశికాంత్ దూబే, గత ప్రధానమంత్రులు నెహ్రూ, ఇందిరా గాంధీ, రాజీవ్ గాంధీలపై వ్యాఖ్యలు చేస్తూ పలు పుస్తకాలను ప్రస్తావించారు. దీనిపై అధ్యక్ష స్థానంలో ఉన్న సభ్యుడు సభ నియమావళి ప్రకారం పుస్తకాలు చదవడం నిషేధమని పేర్కొని అడ్డుకున్నారు. ఈ పరిణామాలతో కాంగ్రెస్ సహా విపక్ష ఎంపీలు సభ మధ్యలోకి వెళ్లి ఆందోళనకు దిగడంతో సభను పలు మార్లు వాయిదా వేశారు. అనంతరం కాంగ్రెస్ ఎంపీలు స్పీకర్‌ను కలిసి, ప్రతిపక్షానికి మాట్లాడే అవకాశం నిరాకరించడంపై అభ్యంతరం తెలిపారు. సాయంత్రం తిరిగి సభ ప్రారంభమైన తర్వాత కాంగ్రెస్ నేత వర్ష గైక్వాడ్ నేతృత్వంలో మహిళా ఎంపీలు ప్రధాని సీటు వైపు వెళ్లడంతో పరిస్థితి మరింత ఉద్రిక్తంగా మారిందని, దీంతో సభను రోజంతా వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారని ఓం బిర్లా వెల్లడించారు.

# అభివృద్ధికి పట్టం కట్టండి: ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి



- 2వ వార్డులో అభ్యర్థి మంజుల నర్సింహ గౌడ్ తరపున ప్రచారం



**చౌటుప్పల్, ఫిబ్రవరి 5 (తొలివెలుగు):** చౌటుప్పల్ మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి గురువారం చౌటుప్పల్ మున్సిపాలిటీ 2వ వార్డులో విస్తృతంగా పర్యటించి కాంగ్రెస్ అభ్యర్థి సుర్వి మంజుల నర్సింహ గౌడ్ తరపున ప్రచారం నిర్వహించారు. వార్డులోని పలు వీధుల్లో తిరుగుతూ ఇంటింటికీ వెళ్లి ఓటర్లను కలుసుకుని 'చేయి' గుర్తుపై ఓటు వేసి అభ్యర్థిని గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు వేగవంతంగా అమలవుతున్నాయని తెలిపారు. ప్రజల సమస్యలను తెలుసుకుని వాటికి పరిష్కారం చూపడమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని ప్రతి వార్డును సమగ్రంగా అభివృద్ధి చేయాలంటే స్థానిక సంస్థల్లో కూడా కాంగ్రెస్ అభ్యర్థులు గెలవడం అవసరమని పేర్కొన్నారు. 2వ వార్డులో తాగునీరు, డ్రైనేజీ, రహదారులు, వీధిదీపాలు, పారిశుధ్యం వంటి మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తామని హామీ ఇచ్చారు. ప్రజలకు అందుబాటులో ఉండే నాయకత్వాన్ని అందించడంలో కాంగ్రెస్ అభ్యర్థులు ముందుంటారని తెలిపారు. మంజుల నర్సింహ గౌడ్ ప్రజలకు సేవ చేయాలనే తపనతో ఎన్నికల బరిలోకి దిగారని, ఆమెను భారీ మెజారిటీతో గెలిపించి అభివృద్ధికి పట్టం కట్టాలని ఓటర్లను కోరారు. ప్రచారంలో పాల్గొన్న నాయకులు, కార్యకర్తలు వార్డు ప్రజలను కలుసుకుని కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. పేదలు, మహిళలు, యువతకు నేరుగా లబ్ధి చేకూరేలా ప్రభుత్వం పనిచేస్తోందని, స్థానికంగా కూడా అదే విధంగా సేవలు అందించేందుకు కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో వార్డు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, వార్డు ప్రజలు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## స్వప్న హత్య హేయం.. న్యాయవాదుల కదం

- రామన్నపేటలో న్యాయవాది స్వప్న హత్యకు నిరసనగా విధుల బహిష్కరణ

**రామన్నపేట, ఫిబ్రవరి 5 (తొలివెలుగు):** రామన్నపేట మండల కేంద్రంలో మొయినాబాద్‌లో జరిగిన యువ న్యాయవాది స్వప్న హత్యను నిరసిస్తూ రామన్నపేట బార్ అసోసియేషన్ న్యాయవాదులు గురువారం విధులను బహిష్కరించి ఆందోళన చేపట్టారు. న్యాయవాదుల భద్రత కోసం తక్షణమే అడ్వకేట్ ప్రొటెక్షన్ యాక్ట్ తీసుకురావాల్సిన అవసరం ఉందని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎండీ మజీద్ పేర్కొన్నారు. న్యాయవాదులపై జరుగుతున్న దాడులను కట్టడి చేయాలని, ఆస్తి వివాదాల కారణంగా ఇలాంటి దాడులు, హత్యలు జరగడం అత్యంత హేయమని ఆయన అన్నారు. ఆస్తి సంబంధిత సమస్యలు తలెత్తినప్పుడు కోర్టులను ఆశ్రయించాలని, హింసాత్మక మార్గాలను ఎట్టి పరిస్థితుల్లోనూ అనుసరించవద్దని సూచించారు. ఈ సందర్భంగా స్వప్న మరణం పట్ల సంతాపం వ్యక్తం చేస్తూ న్యాయవాదులు నిమిషం పాటు మౌనం పాటించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎండీ మజీద్, ఉపాధ్యక్షుడు యాదాసు యాదయ్య, సీనియర్ న్యాయవాదులు జినుకల ప్రభాకర్, కేమ రామదాసు, బసరాజు అశోక్ కుమార్, జగతయ్య, శ్రీశైలం, కూనూరు శ్రీనివాస్, నూతి రమేష్, సతీష్ రెడ్డి, మణికంఠ తదితరులు పాల్గొన్నారు.

## ఖైతాపురంలో ఉచిత వైద్య శిబిరం

- బిపి ఆపరేటర్ అందజేసిన సర్పంచ్ రామలింగేశ్వర్ రెడ్డి

**చౌటుప్పల్, ఫిబ్రవరి 5 (తొలివెలుగు):** యాదాద్రి భువనగిరి జిల్లా, చౌటుప్పల్ మండలం, ఖైతాపురం గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద గురువారం ప్రముఖ వైద్యుల ఆధ్వర్యంలో ఉచిత మెడికల్ క్యాంపు నిర్వహించారు. గ్రామస్తులకు బీపీ, షుగర్ తదితర ప్రాథమిక ఆరోగ్య పరీక్షలు చేసి అవసరమైన వైద్య సూచనలు అందించారు. ఈ సందర్భంగా సర్పంచ్ ఎల్మ రామలింగేశ్వర్ రెడ్డి తన స్వంత ఖర్చులతో బీపీ ఆపరేటర్ పరికరాన్ని కొనుగోలు చేసి వైద్యులకు అందజేశారు. గ్రామంలో ఆరోగ్య సేవలు మరింత మెరుగుపడేందుకు ఈ పరికరం ఉపయోగపడుతుందని తెలిపారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ జయంత్, హెల్త్ అసిస్టెంట్ ఆర్. దేవకి, సి. హెచ్. అనిత, బి. ప్రవీణ్ రెడ్డి, ఆశావర్కర్ గోపనబోయిన నవ్య, ఉపసర్పంచ్ పెరుమాళ్ళ లింగస్వామి, పంచాయతీ కార్యదర్శి అనుషా, వార్డు సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఇసుక అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్ పట్టివేత

**వలిగొండ, ఫిబ్రవరి 5 (తొలివెలుగు):** వలిగొండ మండల పరిధిలోని వేములకొండ గ్రామ సమీపంలోని మూసీ వాగు నుంచి ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను స్థానిక పోలీసులు గురువారం పట్టుకుని సీజ్ చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, వేములకొండ గ్రామానికి చెందిన ఏర్పుల సురేష్ మూసీ వాగు నుంచి అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం అందడంతో పోలీసులు దాడి నిర్వహించారు. ఈ సందర్భంగా అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ యుగంధర్ గౌడ్ తెలిపారు.

## మహిళల ఆర్థికాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

- ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి
- దామెరలో సంఘ బంధం భవనానికి శంకుస్థాపన



**చౌటుప్పల్, ఫిబ్రవరి 5 (తొలివెలుగు):** మహిళల అభివృద్ధి, ఆర్థిక స్వావలంబన కోసం కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోందని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి అన్నారు. గురువారం చౌటుప్పల్ మండలం దామెర గ్రామంలో మహిళా సంఘ బంధం భవన నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహిళలు ఆర్థికంగా బలపడితే కుటుంబాలు, గ్రామాలు అభివృద్ధి చెందుతాయని పేర్కొన్నారు. సంఘ బంధం భవనం నిర్మాణం మహిళా సంఘాల కార్యకలాపాలకు ఉపయోగకరంగా నిలుస్తుందని తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ ఉబ్బు వెంకటయ్య, సర్పంచ్ సాతిరి శ్రీధర్ రావు, ఉప సర్పంచ్ ఉప్పునూతల నరసింహ, పబ్బు రాజు గౌడ్, బోయ దేవేందర్, ఏపీఎం ఊరిపక్క యాదయ్య, సిసి నరసింహ, ఏఈపీఆర్, ఎంపీడీవో కార్యాలయ సూపరింటెండెంట్, గ్రామపంచాయతీ పాలకవర్గ సభ్యులు గొడుగు అశోక్ కుమార్, మంజుల, ఉడుగు అలివేలు, మండల సమాఖ్య అధ్యక్షురాలు కోలుకులపల్లి అలివేలు, కార్యదర్శి దీప, కోశాధికారి రొడ్డే శంకరమ్మ, గ్రామ సంఘం కమిటీ సభ్యులు, మహిళలు, నాయకులు బిక్షం, యాదయ్య, సత్యనారాయణ, మచ్చ గిరి, నారెడ్డి, రజిత, వినోద పాల్గొన్నారు.



## సంధ్యమ్మకే మా ఓటు.. వెన్‌రెడ్డి రాజు పాలనపై ప్రజల నమ్మకం

- 16వ వార్డులో 'వన్‌సైడ్' వార్!
- రాజు మార్క్ అభివృద్ధి.. సంధ్య రాజుకు బ్రహ్మరథం



**చౌటుప్పల్, ఫిబ్రవరి 5 (తొలివెలుగు):** చౌటుప్పల్ మున్సిపాలిటీ 16వ వార్డులో ఈసారి ఎన్నికల పోరు ఏకపక్షంగా మారే పరిస్థితి కనిపిస్తోందని స్థానిక ప్రజలు అభిప్రాయపడుతున్నారు. వార్డు ప్రజల అభిప్రాయాలను పరిశీలిస్తే 'చేయి' గుర్తు వైపే మద్దతు వ్యక్తమవుతోందని తెలుస్తోంది. గతంలో మాజీ మున్సిపల్ చైర్మన్ వెన్‌రెడ్డి రాజు చేసిన అభివృద్ధి పనులను గుర్తు చేసుకుంటూ, అదే దారిలో ఆయన సతీమణి వెన్‌రెడ్డి సంధ్య రాజుకు మద్దతు ఇస్తున్నట్లు చెబుతున్నారు. గతంలో 16వ వార్డు నుంచి కౌన్సిలర్‌గా గెలిచి, అనంతరం మున్సిపల్ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన వెన్‌రెడ్డి రాజు తాగునీరు, డ్రైనేజీ, రహదారులు, వీధిదీపాలు, పారిశుధ్యం వంటి మౌలిక సమస్యల పరిష్కారానికి కృషి చేశారని ప్రజలు గుర్తు చేసుకుంటున్నారు. ఊర చెరువు, నాగులకుంట సుందరీకరణ వంటి పనులు కూడా అభివృద్ధికి నిదర్శనమని పేర్కొంటున్నారు. పదవిని అలంకారంగా కాకుండా ప్రజాసేవకు వినియోగించుకున్న నాయకుడిగా ఆయన నిలిచారని, కులమత భేదాలు లేకుండా ప్రతి ఒక్కరితో మమేకమై సమస్యల పరిష్కారానికి కృషి చేశారని స్థానికులు చెబుతున్నారు. అదే తత్వాన్ని వెన్‌రెడ్డి సంధ్య రాజు కూడా అనుసరిస్తున్నారని, గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ సంస్థ ద్వారా అనేక స్వచ్ఛంద సేవా కార్యక్రమాలు నిర్వహించి ప్రజల మన్ననలు పొందారని పేర్కొంటున్నారు. ప్రస్తుతం కాంగ్రెస్ అభ్యర్థిగా బరిలోకి దిగిన సంధ్య రాజు, స్థానిక నాయకులు, కార్యకర్తలతో కలిసి గడపగడపకు వెళ్లి విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. ఇంటింటికి వెళ్లి ప్రజలను ఆప్యాయంగా పలకరిస్తూ, రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరిస్తున్నారు. ప్రచారంలో భాగంగా వార్డు సమస్యలైన తాగునీరు, డ్రైనేజీ, రహదారులు, వీధిదీపాలు, పారిశుధ్యం వంటి అంశాలను తెలుసుకుంటూ, ఎన్నికల్లో విజయం సాధించిన వెంటనే మిగిలిన సమస్యలను పరిష్కరించేందుకు ప్రాధాన్యం ఇస్తానని హామీ ఇస్తున్నారు. ప్రజలకు ఎప్పుడూ అందుబాటులో ఉంటూ పారదర్శక సేవలు అందిస్తానని ఆమె తెలిపారు. ప్రచారంలో సంధ్య రాజుకు లభిస్తున్న ఆదరణతో 16వ వార్డులో ఎన్నికల పోరు ఏకపక్షంగా మారే అవకాశముందని స్థానికులు భావిస్తున్నారు. మున్సిపాలిటీ అభివృద్ధికి కృషి చేసే నాయకత్వం సంధ్య రాజుకే ఉందని, ఆమె నాయకత్వంలో చౌటుప్పల్ మరింత అభివృద్ధి చెందుతుందని వార్డు ప్రజలు విశ్వాసం వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్రంలోనే ఉత్తమ మున్సిపాలిటీగా తీర్చిదిద్దే సత్తా ఉన్న నాయకురాలు సంధ్య రాజు అని స్థానికులు ధీమా వ్యక్తం చేస్తున్నారు.

## మున్సిపల్ ప్రచారంలో కోమటిరెడ్డి మార్క్!



- బీఆర్ఎస్‌కు షాక్.. కాంగ్రెస్‌లోకి భారీగా చేరికలు



**చౌటుప్పల్, ఫిబ్రవరి 5 (తొలివెలుగు):** చౌటుప్పల్ మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి గురువారం చౌటుప్పల్ మున్సిపాలిటీ 19, 9, 10, 11వ వార్డుల్లో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా 10వ వార్డులో బొడిగే బాలకృష్ణ గౌడ్ ఆధ్వర్యంలో టీఆర్ఎస్‌కు చెందిన ముఖ్య నాయకులు ఎండీ ఖదీర్, మారుపాక నరేష్ గౌడ్ ఎమ్మెల్యే సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో 10వ వార్డు కాంగ్రెస్ కౌన్సిలర్ అభ్యర్థి దేప రమ్య రాజు, 11వ వార్డు కాంగ్రెస్ కౌన్సిలర్ అభ్యర్థి గోశిక వినయ్, 9వ వార్డు కాంగ్రెస్ కౌన్సిలర్ అభ్యర్థి మొగుదాల పావని రమేష్ గౌడ్, 19వ వార్డు కాంగ్రెస్ కౌన్సిలర్ అభ్యర్థి పిల్లలమర్రి మధుసూదన్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఉబ్బు వెంకటయ్య, మాజీ మున్సిపల్ చైర్మన్ వెన్‌రెడ్డి రాజు, మాజీ జెడ్పీటీసీ చిలుకూరు ప్రభాకర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మునుగోడు నియోజకవర్గ సమన్వయకర్త పబ్బు రాజు గౌడ్, వ్యవసాయ మార్కెట్ వైస్ చైర్మన్ ఆకుల ఇంద్రసేనారెడ్డి, మండల అధ్యక్షుడు బోయ దేవేందర్, 10వ వార్డు నాయకులు ముత్యాల ప్రభాకర్ రెడ్డి, పల్చం సత్యం, పల్చం శీను, మహమ్మద్ చాంద్ పాషా, చింతల మహేందర్, ఎండీ హాజీజ్, ఏ. శంకర్, పోలోజు శ్రీనివాసచారి, ఎరుకల సాయి గౌడ్, దీప నరేష్, కానుగు మధు, ఎండీ సమీర్, భరత్, మెరుగు ప్రవీణ్, ఎక్కల దేవి, హరీష్, ఎండీ ఆజం, రాచకొండ బన్నీ, దీప సిద్ధార్థ, కైరంకొండ శ్రీనివాస్, బాలరాజ్ తదితరులు పాల్గొన్నారు.



## ఖోఖోలో మోడల్ స్కూల్ విద్యార్థుల ప్రభంజనం

- సీఎం కప్-2026 పోటీల్లో ప్రథమ బహుమతి

**వలిగొండ, ఫిబ్రవరి 5 (తొలివెలుగు ):** భువనగిరి నియోజకవర్గ స్థాయి 'సీఎం కప్-2026' క్రీడల్లో వలిగొండ మండలం లోతుకుంట మోడల్ స్కూల్ విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచారు. భువనగిరిలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల వేదికగా జరిగిన ఖోఖో (బాలుర) పోటీల్లో వీరు ప్రథమ బహుమతి కైవసం చేసుకున్నట్లు పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు (పీడీ) జి. ఐలయ్య ఒక ప్రకటనలో తెలిపారు. అత్యంత ఉత్కంఠభరితంగా సాగిన ఈ పోటీల్లో విద్యార్థులు తమ క్రీడా నైపుణ్యంతో ప్రత్యర్థులను చిత్తు చేశారు. విజేతలను పాఠశాల ప్రిన్సిపాల్ రహిసున్నీస బేగం, శేఖర్ ప్రత్యేకంగా అభినందించారు. క్రీడల్లో రాణించడం వల్ల మానసిక ఉల్లాసంతో పాటు నాయకత్వ లక్షణాలు పెరుగుతాయని వారు పేర్కొన్నారు.

## నాయకురాలిని కాదు.. మీ ఇంటి సేవకురాలిని

- 18వ వార్డులో కాంగ్రెస్ అభ్యర్థి అరుణశంకర్ ఇంటింటి ప్రచారం



**చౌటుప్పల్, ఫిబ్రవరి 5 (తొలివెలుగు):** చౌటుప్పల్ మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా 18వ వార్డు కాంగ్రెస్ అభ్యర్థి గూగులోతు అరుణ శంకర్ గురువారం వార్డులో విస్తృతంగా పర్యటించి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ప్రతి ఇంటికి వెళ్లి 'చేయి' గుర్తుపై ఓటు వేసి తనను గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తనను నాయకురాలిగా కాకుండా ప్రజల సేవకురాలిగా భావించాలని, వార్డు ప్రజల సమస్యల పరిష్కారమే తన ప్రధాన లక్ష్యమని తెలిపారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రతి ఇంటికి చేరాలంటే మున్సిపాలిటీలో కూడా కాంగ్రెస్‌కు మద్దతు ఇవ్వాలని కోరారు. ఈ ప్రచార కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ కామిశెట్టి శైలజ భాస్కర్ గుప్తా, వార్డు ఇంచార్జ్ దోనూరు జైపాల్ రెడ్డి, కాసోజు గోవర్ధన చారి, గుర్రం వెంకటేశం, ఓర్సు రాజు, లింగాచారి, సోను, మహిళలు తదితరులు పాల్గొన్నారు.






# సీఎం వ్యాఖ్యలు హేయం

**సీఎం రేవంత్ వ్యాఖ్యలపై మాజీ ఎమ్మెల్యే భాస్కర్ రావు ఫైర్**

**(తొలివెలుగు): మిర్యాలగూడ:** మిర్యాలగూడ అభివృద్ధికి ప్రతీకగా నిలిచిన మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్ రావుపై రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను బీఆర్ఎస్ పార్టీ తీవ్రంగా ఖండించింది. శుక్రవారం మిర్యాలగూడ రెడ్డి కాలనీలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన పత్రికా సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు సీఎం వ్యాఖ్యలను ప్రజాస్వామ్య విరుద్ధమని పేర్కొన్నారు.ఈ సమావేశంలో మాజీ ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్ మాట్లాడుతూ, నిన్న జరిగిన కాంగ్రెస్ సభలో సీఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు పూర్తిగా అసత్య ఆరోపణలతో కూడినవని అన్నారు. ప్రజల కోసం నిస్వార్థంగా పనిచేసిన భాస్కర్ రావుపై వ్యక్తిగత విమర్శలు చేయడం సీఎం స్థాయికి తగదని స్పష్టం చేశారు. రాజకీయ విమర్శలు సహజమే అయినా, అభివృద్ధి చేసిన నాయకులపై దూషణలు చేయడం అహంకారానికి నిదర్శనమని వ్యాఖ్యానించారు.భాస్కర్ రావు మిర్యాలగూడ నియోజకవర్గానికి చేసిన అభివృద్ధి పనులు ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయాయని, వాటిని మాటలతో కూల్చలేరని అన్నారు. సీఎం తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుని భాస్కర్ రావుకు బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్ రావు మాట్లాడుతూ, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్‌పై సీఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు రాజకీయ విలువలకు విరుద్ధమని అన్నారు. కేసీఆర్ ప్రాణాలకు తెగించి ఉద్యమించి తెలంగాణ రాష్ట్రాన్ని సాధించకపోతే, నేడు తెలంగాణ ప్రజాస్వామ్యమే ఉండేది కాదని పేర్కొన్నారు.తెలంగాణ రాష్ట్రం వచ్చిన తర్వాతే రాజకీయ అవకాశాలు లభించాయని, అలాంటి రాష్ట్ర ప్రదాతను విమర్శించడం సరికాదని స్పష్టం చేశారు. తాను పదవిలో ఉన్న సమయంలో మిర్యాలగూడ అభివృద్ధినే లక్ష్యంగా చేసుకుని పనిచేశానని, చేపట్టిన అభివృద్ధి పనులు ప్రతి గడపకు తెలుసని తెలిపారు. ప్రజలు అన్నీ గమనిస్తున్నారని, మాటల రాజకీయాలకు తగిన సమయంలో తగిన తీర్పు ఇస్తారని అన్నారు.ఈ సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు అన్నభిమోజు నాగార్జున చారి, యువనేత సిద్ధార్థ, దుర్గంపూడి నారాయణ రెడ్డి, వీరకోటి రెడ్డి, బైరం సంపత్, కట్టా మల్లేష్ గౌడ్, ప్రకాష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రచారం స్పీడ్ పెంచిన 2వ ఇండిపెండెంట్ అభ్యర్థి పుట్టబంతి తిరుపతిరావు

కోదాడ మునిసిపల్ ఎన్నికల్లో 2 వ వార్డు ఇండిపెండెంట్ అభ్యర్థి పుట్ట బంతి తిరుపతిరావు కౌన్సిలర్ అభ్యర్థి ప్రచారం లో దూసుకెళుతున్నారు. ఓటు వేయండి...గెలిపించండి... ఓటు మీ బాధ్యత అభివృద్ధి నాది భరోసా అన్నారు. అభివృద్ధి పథంలో నడిపిస్తా అన్నారు.అభివృద్ధిని ఆదరించి గెలిపించాలన్నారు. ప్రతి ఒక్కరు ఓటు వేయాలన్నారు.స్థానిక నాయకులు కార్య కర్తలు ఓటింగ్ పూర్తి అయ్యే వరకు విశ్రమించకుండా పార్టీ గెలుపు కు పని చేయాలన్నారు. ఈసందర్భంగా పుట్టబంతి తిరుపతిరావు మాట్లాడుతూ, 2 వ వార్డ్ లో ఉన్న అనేక మౌలిక సదుపాయాలను వార్డు పరిశుభ్రత, మంచినీటి సరఫరా, విద్యుత్, డ్రైనేజ్ ,నూతన సిసి రోడ్ల నిర్మాణం పనులు చేపట్టి వార్డు అభివృద్ధి చేసి ఆదర్శ వార్డుగా తీర్చిదిద్దుతామని తెలిపారు కావున ప్రతి ఒక్కరు కారు గుర్తుపై తమ అమూల్యమైన ఓటు వేసి అత్యధిక ఓట్ల మెజారిటీతో గెలిపించాలని అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కార్యకర్తలు మహిళలు మరియు వార్డు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.


## యాదాద్రి భువనగిరి జిల్లాలో ప్రజలను బయపెడుతున్న పెద్దపులి

**ఆత్మకూరు(ఎం) :** నెలరోజులుగా ఊర్లు మొత్తం చుట్టేస్తున్న పెద్దపులి.సిద్దిపేట జిల్లా జగదేవ్ పూర్ మండలంలో సైతం పులి సంచారం జరిగినట్టు ఆనవాళ్లు.గడిచిన 20 రోజుల్లో సుమారు 9 లేగ దూడలను చంపితిన్న పులి.నెల రోజులుగా అటవీ శాఖ అధికారులకు చుక్కలు చూపిస్తున్న టైగర్.యాదాద్రి భువనగిరి జిల్లాలోని తుర్కపల్లి, యాదగిరిగుట్ట, రాజాపేట,ఆలేరు,మోటాకోండూర్, ఆత్మకూరు(ఎం) మండలం పల్లెపహాడ్, పారుపల్లి గ్రామాల పరిధిలోకి పెద్దపులి ప్రవేశించి ఒదంటున్న ఉహాగానాలు.గురువారం రోజున రాయిపల్లి గ్రామ పరిధిలోకి వచ్చినట్లు పాదముద్రలు ఉన్నట్లు గ్రామస్థుడు సాయికుమార్ ఫారెస్టు అధికారులకు సమాచారం చేరవేసినట్లుగా ఊహాగానాలు, అయినప్పటికీ ఆత్మకూరు(ఎం), మోత్కూర్, గుండాల మండల ప్రజలు అప్రమత్తంగా ఉండాలంటున్నారు ఫారెస్ట్ అధికారులు అంటూ జనాలలో నానుతుంది.వ్యవసాయ బావుల వద్ద రైతులు జాగ్రత్తగా ఉండాలని సూచనలు అంటూ జనాలలో ప్రచారం.సుమారు 300 కిలోల బరువున్నది పెద్దపులి అంటూ, పెద్దపులి సంచారంపై ఫారెస్ట్ ఆఫీసర్లు అలెర్టుగా ఉండాలంటున్నారని జనాలలో వాట్సాపులలో ప్రచారం. పెద్దపులిని పట్టుకోవడం కోసం 10 మంది ఆఫీసర్లు 5 మంది చొప్పున 2 టీమ్ లుగా పెద్దపులి వెళ్లే రూట్ ను ట్రాక్ చేస్తున్నారని, రాత్రివేళ రోజు 30 కిలోమీటర్ల దూరం ప్రయాణిస్తున్నట్లుగా ప్రజలు అప్రమత్తంగా ఉండాలంటున్నారు ఫారెస్ట్ అధికారులని జనాలలో ప్రచారం. వాస్తవం ఏమిటో అధికారులు తెలిపిన ప్రజలలో ఉన్న భయం, ఊహాగానాలను తొలగించిన వారు అవుతారు.



# వార్డుల అభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యం

## ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి





**- లింగోజిగుడెం 3వ వార్డు అభ్యర్థి పల్లె లావణ్య సురేందర్ రెడ్డికి మద్దతుగా విస్తృత ప్రచారం**

**చౌటుప్పల్, ఫిబ్రవరి 5 (తొలివెలుగు):** చౌటుప్పల్ మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో పట్టణంలో రాజకీయ వాతావరణం రోజురోజుకూ ఉత్కంఠభరితంగా మారుతోంది. ప్రధాన పార్టీలన్నీ తమ అభ్యర్థుల గెలుపుకోసం ప్రచారాన్ని ముమ్మరం చేస్తున్నాయి. ఈ క్రమంలో గురువారం మున్సిపాలిటీ పరిధిలోని లింగోజిగుడెం 3వ వార్డులో ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ తరపున పోటీ చేస్తున్న అభ్యర్థి పల్లె లావణ్య సురేందర్ రెడ్డికి మద్దతుగా ఆయన ఇంటింటికీ తిరుగుతూ ప్రజలను కలుసుకుని ఓట్లు అభ్యర్థించారు. ప్రచారం సందర్భంగా ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి స్థానికులతో స్నేహపూర్వకంగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. ముఖ్యంగా వార్డులో నెలకొన్న డ్రైనేజీ సమస్యలు, తాగునీటి కొరత, రహదారుల అభివృద్ధి, కాలువల నిర్మాణం, వీధి దీపాల ఏర్పాటు వంటి మౌలిక వసతులపై ప్రజలు తమ వినతులను వెల్లడించారు. ప్రజలు చెప్పిన ప్రతి సమస్యను శ్రద్ధగా విన్న ఆయన, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు గెలిస్తే వార్డు అభివృద్ధికి ప్రాధాన్యత ఇచ్చి పరిష్కారం చూపిస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఎమ్మెల్యే, మున్సిపాలిటీ సమగ్ర అభివృద్ధి సాధ్యమవ్వాలంటే కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలని ప్రజలను కోరారు. ప్రతి వార్డు అభివృద్ధి చెందాలంటే ప్రజలకు అందుబాటులో ఉండే నాయకత్వం అవసరమని, అది కాంగ్రెస్ పార్టీ ద్వారానే సాధ్యమవుతుందని పేర్కొన్నారు. చౌటుప్పల్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిన ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దేందుకు తాను ప్రత్యేక చర్యలు తీసుకుంటానని తెలిపారు. లింగోజిగుడెం ప్రజలు ఎమ్మెల్యేకు, అభ్యర్థి పల్లె లావణ్య సురేందర్ రెడ్డికి ఘన స్వాగతం పలికారు. మహిళలు మంగళహారతులతో ఆహ్వానించగా, యువత పెద్ద సంఖ్యలో పాల్గొని నినాదాలతో ఉత్సాహంగా ప్రచారాన్ని ముందుకు తీసుకెళ్లారు. ఇంటింటికీ వెళ్లి ఓటర్లను కలుస్తూ అభ్యర్థికి మద్దతు ప్రకటించిన ప్రజలు, స్థానిక సమస్యల పరిష్కారంపై ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రచారం సందర్భంగా కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. వార్డు పరిసరాల్లో నినాదాలతో ఉత్సాహభరిత వాతావరణం నెలకొంది. ఎన్నికలు సమీపిస్తున్న వేళ కాంగ్రెస్ పార్టీ ప్రచారాన్ని మరింత వేగవంతం చేస్తూ ప్రతి వార్డులో ప్రజలను కలుస్తూ మద్దతు కోరుతోంది. కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ నాయకులు, ముఖ్య కార్యకర్తలు, మహిళలు, యువత, వార్డు ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# పట్టణ ప్రజలతో మమేకమై ఎన్నికల ప్రచారం



సిరిసిల్ల టౌన్ : మున్సిపల్ ఎన్నికల ప్రచారానికి వెళ్లిన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్‌కు సిరిసిల్ల కార్మికక్షేత్రం బ్రహ్మరథం పట్టింది. ప్రచారంలో భాగంగా ఓ సాధారణ వ్యక్తిలా పలు వార్డుల్లో కలియదిరిగిన రామన్నకు అడుగడుగునా అభిమానం వెల్లువెత్తింది. ఇటీవల మున్సిపాలిటీలో విలీనమైన ఒకటో వార్డు జ్యోతినగర్‌కాలనీ నుంచి ప్రచారం ప్రారంభించిన కేటీఆర్.. నేలపై కూర్చొని స్థానిక మహిళలతో ముచ్చటించారు. వారు చెప్పిన మాటలు, సమస్యలు ఓపిగ్గా విని పరిష్కారం కోసం చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.ఈ సందర్భంగా కాంగ్రెస్ ఇస్తామన్న తులం బంగారం వచ్చిందా? మహిళలకు రూ.2,500 వచ్చినయా? అవ్వాతాతలకు రూ.4 వేలు పింఛన్ ఇచ్చింంద్రా? రైతుభరోసా ఏ సింద్రా? అని అడిగారు. తన మీద కోపంతో సిరిసిల్ల జిల్లా తీసేస్తరట కదా అమ్మా అంటూ అడుగగా, అప్పటివరకు ప్రశాంతంగా ఉన్న ఆడబిడ్డలంతా ఒకసారిగా కాంగ్రెస్ సర్కార్‌పై మండిపడ్డారు. తాము కారు గుర్తుకే ఓటేస్తామంటూ బీఆర్ఎస్‌కు జైకొట్టారు. అనంతరం నేతన్నలు, మహిళలు వెంట రాగా కేటీఆర్ వారితో కలిసి ముందుకు సాగారు. ఇంటి నుంచి ఒక్కొక్కరుగా బయటకు వచ్చి కేటీఆర్‌తో కరచాలనం చేసేందుకు ఉత్సాహం చూపారు. అందరి యోగక్షేమాలు అడుగుతూనే కాంగ్రెస్ ఇచ్చిన హామీలు చేయకపోవడం వల్ల కలిగే ఇబ్బందులు, బీఆర్ఎస్ చేస్తున్న పోరాటాన్ని వివరిస్తూ కేటీఆర్ ముందుకు కదలిరారు. కేసీఆర్ పదేండ్ల పాలనలో నేతన్నల సంక్షేమానికి తీసుకున్న చర్యలు రెండేండ్లుగా కొనసాగుతున్న సంక్షోభం వంటి అంశాలను కండ్లకు కట్టినట్టు వివరించారు.

**జ్యోతినగర్‌ను దత్తత తీసుకుంటా**

సిరిసిల్లలోని ఒకటో వార్డు జ్యోతినగర్‌ను దత్తత తీసుకుని అభివృద్ధి చేస్తానని కేటీఆర్ హామీ ఇచ్చారు. అనంతరం పట్టణంలోని బీవైనగర్ జెండా చౌరస్తా, సుందరయ్యనగర్, వెంకంపేట, హనుమాన్ టెం పుల్ చౌరస్తా, రాజీవ్‌నగర్ గాంధీచౌరస్తా, శాంతినగర్ చౌరస్తాలో ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. అడ్డగోలు హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత కల్యాణలక్ష్మి, షాదీముబారక్ వంటి కార్యక్రమాలను కూడా పకనపెట్టారని మండిపడ్డారు. కాంగ్రెస్ సర్కార్ అడ్డగోలుగా మాటలు, అబద్ధాలు ఆడడం తప్ప ఈ రెండేండ్లలో ఒక మంచి పని కూడా లేదని విమర్శించారు. చేతిలో అధికారం, అవకాశం ఉన్నప్పుడు కేసీఆర్‌ను తిట్టాల్సిన అవసరం ఏమున్నదని ప్రశ్నించారు.

చేతనైతే ప్రజలకు మంచి చేయాలి లేదా ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. కేసీఆర్ ఏర్పా టు చేసిన చిన్న జిల్లాలను తీసివేయాలని కాంగ్రెస్ ప్రభుత్వం కుట్ర పన్నుతున్నదని ఆరోపించారు. జిల్లాలు ఎత్తివేస్తామని చెప్పిన తర్వా త కాంగ్రెస్ పార్టీకి ఓటు వేస్తే అది మంచిదా.. చెడ్డ దా..? అనే విషయం ఆలోచించి ఓటేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ మున్సిపల్ ఎన్నికలు పదేండ్ల పాటు ప్రజలకు అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు ఇచ్చిన బీఆర్ఎస్ పార్టీకి, రెండేండ్ల నుంచి సంక్షేమ పథకాలను ఎగ్గొట్టిన కాంగ్రెస్ పార్టీకి మధ్య పోటీ అని కేటీఆర్ పేర్కొన్నారు. సిరిసిల్లలో పద్మశాలీ సంఘానికి రూ.25 కోట్ల విలువైన ఐదెకరాల భూమి, రూ.8 కోట్లు మంజూరు చేశామని గుర్తుచేశారు.

**కాంగ్రెస్, బీజేపీ పది పైసల పనిచేయలేదు**

పన్నెండేళ్లు కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ, ఇక్కడ ఎంపీగా ఉన్న బండి సంజయ్ సిరిసిల్లకు 10 పైసల పని కూడా చేయలేదని, సిగ్గులేకుండా ఓట్లు అడుగుతున్నారని కేటీఆర్ మండిపడ్డారు. ఆరు గ్యారెంటీలను, 420 హామీలను అమలు చేయలేకపోవడాన్ని ప్రశ్నిస్తే బూతు మాటలు మాట్లాడుతున్నారని దుయ్యబట్టారు. రాష్ట్రంలో లక్షలాదిగా ఉన్న బీడీ కార్మికులు పింఛన్ ఇయ్యమని అడుగకముందే వారికి ఇచ్చిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందని కొనియాడారు. రేవంత్‌రెడ్డి ఎన్నికల ముందు డబుల్ ఇస్తామని అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో అమలు చేస్తామని గద్దెనెక్కారని.. ఇప్పటికి 800 రోజులైనా పెంచిన పింఛన్లు, కేసీఆర్ కిట్, బతుకమ్మ చీరలు, స్కూటీలు, మహిళలకు 2,500, కల్యాణలక్ష్మి తులం బంగారం ఇవ్వలేదని మండిపడ్డారు.

# మూడు నెలల్లో 97,080 ఇళ్ల అమ్మకం..

ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక అనిశ్చితులు, భౌగోళిక రాజకీయ అస్థిరతలు కొనసాగుతున్నప్పటికీ.. మన దేశంలో నివాస విభాగం స్థిరమైన వృద్ధిని నమోదు చేస్తోంది. పెరుగుతున్న ఆదాయాలు, పట్టణీకరణ, గృహ యజమానుల అభిరుచులతో గృహాల కొనుగోళ్లు స్థిరంగానే ఉంటున్నాయి. దేశంలోని ఏడు ప్రధాన నగరాలలో ఈ ఏడాది మూడో త్రైమాసికం(క్యూ3)లో 97,080 ఇళ్లు అమ్ముడుపోయాయి. గతేడాది క్యూ3లో విక్రయమైన 1,07,060 యూనిట్లతో పోలిస్తే 9 శాతం తగ్గగా.. ఈ ఏడాది క్యూ2లో సేల్ అయిన 96,290 నివాసాలతో పోలిస్తే 1 శాతం వృద్ధి చెందాయని అనరాక్ రీసెర్చ్ రిపోర్ట్ వెల్లడించింది. ఇక, 2025 క్యూ3లో 96,690 యూనిట్లు లాంచింగ్ అయ్యాయి. క్యూ2లో సరఫరా అయిన 98,630 యూనిట్లతో పోలిస్తే 2 శాతం క్షీణించగా.. గతేడాది క్యూ3లో సప్లయ్ అయిన 93,750 యూనిట్లతో పోలిస్తే మాత్రం 3 శాతం పెరిగాయి. అయితే ఇళ్ల అమ్మకాలు తగ్గినప్పటికీ వాటి విలువ మాత్రం 14 శాతం పెరిగింది. గతేడాది క్యూ3లో అమ్ముడైన ఇళ్ల విలువ రూ.1.33 లక్షల కోట్లుగా ఉండగా.. ఈ ఏడాది క్యూ3లో విక్రయమైన గృహాల విలువ రూ.1.52 లక్షల కోట్లుగా ఉంది.



**లగ్జరీ ఇళ్లదే హవా..**

ఇళ్ల విక్రయాలు, లాంచింగ్స్‌లో ముంబైలో అత్యధికంగా జరిగాయి. దేశ ఆర్థిక రాజధానిలో 2025 క్యూ3లో 30,260 గృహాలు అమ్ముడుపోగా.. 29,565 యూనిట్లు ప్రారంభమయ్యాయి. ఆ తర్వాత పుణెలో 16,620 ఇళ్లు విక్రయం కాగా.. 19,375 యూనిట్లు లాంచింగ్ అయ్యాయి. లాంచింగ్స్‌లో అత్యధికంగా లగ్జరీ గృహాలదే ఆధిపత్యం కొనసాగుతుంది. రూ.కోటిన్నర కంటే ఎక్కువ ధర ఉన్న విలాసవంతమైన ఇళ్ల వాటా 38 శాతంగా ఉండగా.. అందుబాటు గృహాల వాటా 16 శాతంగా ఉంది. రూ.80 లక్షల నుంచి రూ.కోటిన్నర ధర ఉన్న ప్రీమియం గృహాల వాటా 24 శాతం, రూ.40%-%80 లక్షల ధర ఉన్న మధ్యతరగతి ఇళ్ల వాటా 23 శాతంగా ఉంది.

**5.64 లక్షల ఇన్వెంటరీ..**

అమ్మకానికి సిద్ధంగా ఉన్న(ఇన్వెంటరీ) యూనిట్ల సంఖ్య గతేడాది క్యూ3లో 5.64 లక్షలుగా ఉండగా.. ఈ క్యూ3 నాటికి 5.61 లక్షలకు తగ్గాయి. ఏడాదిలో ప్రాపర్టీల ధరలు 9 శాతం పెరిగాయి. వార్షిక ప్రాతిపదికన అత్యధికంగా ఎన్‌సీఆర్‌లో ధరలు 24 శాతం పెరగగా.. బెంగళూరులో 10 శాతం వృద్ధి చెందాయి.

### హైదరాబాద్‌లో..

ఈ ఏడాది మూడో త్రైమాసికంలో హైదరాబాద్‌లో 8,630 గృహాలు లాంచింగ్ అయ్యాయి. గతేడాది ఇదే కాలంలో ప్రారంభమైన 13,890 యూనిట్లతో పోలిస్తే ఇది 38 శాతం తక్కువ. ఏడాది కాలంలో నగరంలో లాంచింగ్స్ 22 శాతం మేర తగ్గాయి. నగరంలో ప్రీమియం, లగ్జరీ, అల్ట్రా లగ్జరీ గృహాల డిమాండ్ కొనసాగుతోంది. అందుకే ఈ క్యూ3లో లాంచింగ్ అయిన యూనిట్లలో రూ.80 లక్షల కంటే ఎక్కువ ధర ఉన్న ఇళ్ల వాటా ఏకంగా 87 శాతంగా ఉంది. ఇక, 2025 క్యూ3లో నగరంలో 11,305 యూనిట్లు అమ్ముడుపోయాయి. గతేడాది ఇదే కాలంలో విక్రయమైన 12,735 ఇళ్లతో పోలిస్తే ఇది 11 శాతం తక్కువ.



## ట్యాగ్‌లైన్ చెప్పు.. బహుమతి పట్టు..
## ఈపీఎఫ్ఓ ఆన్‌లైన్ పోటీ

ప్రజలకు ప్రత్యేకమైన ఆన్‌లైన్ పోటీ నిర్వహిస్తున్నట్లు ఉద్యోగ భవిష్యనిధి సంస్థ తాజాగా ప్రకటించింది. సంస్థ ఆశయాలు, విధులకు అద్దం పట్టేలా ఓ అర్థవంతమైన ట్యాగ్‌ను సూచించాలని ప్రజలను కోరింది. కంపెనీకి చెందిన వెబ్‌సైట్‌కు ఆన్‌లైన్ ట్యాగ్‌ను పెట్టాలనుకున్న భవిష్యనిధి సంస్థ దీనికోసం ఓ ప్రకటనను విడుదల చేసింది. మంచి ట్యాగ్‌లైన్‌ను సూచించిన ముగ్గురిని విజేతలుగా ఎంపిక చేసి.. వారికి నగదు బహుమతులు సైతం ఇవ్వనున్నట్లు వెల్లడించింది. మొదటి బహుమతిగా రూ.21వేలు, రెండో బహుమతిగా రూ.11వేలు, మూడో బహుమతిగా రూ.5,100 ఇవ్వనున్నట్లు తెలిపింది. విజేతలకు త్వరలో దిల్లీలో నిర్వహించనున్న ఈపీఎఫ్ఓ వ్యవస్థాపక దినోత్సవానికి హాజరయ్యే అవకాశం కూడా కల్పిస్తున్నట్లు పేర్కొంది. అక్టోబర్ 1న ప్రారంభమైన ఈ పోటీ ఈనెల 10వరకు కొనసాగుతుందని ఉద్యోగ భవిష్యనిధి సంస్థ తెలిపింది. ఇంకా సమయం ఉన్నందున ప్రజలు పెద్ద ఎత్తున పోటీలో పాల్గొనాలని కోరింది. పోటీకి సంబంధించిన సమాచారం కోసం ఇతర విషయాలు తెలుసుకోవడానికి ఈపీఎఫ్ఓ ట్విటర్ అధికారిక ఖాతాలో ఓ క్యూఆర్ కోడ్‌ను విడుదల చేసింది. ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి.. పోటీలో పాల్గొనేవారు రూపొందించిన ట్యాగ్‌లను అప్‌లోడ్ చేయొచ్చు.

## 9 నెలల్లో 3000 సేల్స్!: ఇండియాలో ఆడి అమ్మకాలు



ఆడి ఇండియా.. 2025 మొదటి తొమ్మిది నెలల్లో కేవలం 3,197 యూనిట్లను విక్రయించినట్లు ప్రకటించింది. భౌగోళిక రాజకీయ సవాళ్లు, కస్టమర్ సెంటిమెంట్ వంటివన్నీ అమ్మకాల మీద ప్రభావం చూపించింది. GST 2.0 అమలు తర్వాత.. పండుగ సమయంలో డిమాండ్ పెరుగుతుందని కంపెనీ భావిస్తోంది. కంపెనీ అమ్మకాల గురించి.. ఆడి ఇండియా అధిపతి బల్బీర్ సింగ్ ధిల్లాన్ మాట్లాడుతూ, ఈ సంవత్సరం లగ్జరీ కార్ల విభాగం కొంత ఒడిదుడుకులను ఎదుర్కోవాల్సి వచ్చింది. అయితే కొత్త జీఎస్టీ అమలులోకి వచ్చిన తరువాత.. కార్ల అమ్మకాలు పెరిగే అవకాశం ఉందని భావిస్తున్నామని అన్నారు. ఆడి కంపెనీ దేశ వ్యాప్తంగా తన నెట్‌వర్క్ విస్తరిస్తోంది. ఇందులో భాగంగానే.. తన ఎలక్ట్రిక్ కార్ల కోసం ఛార్జింగ్ స్టేషన్స్ ఏర్పాటు చేయడం, డీలర్‌షిప్స్ విస్తరించడం వంటివి చేస్తోంది. అంతే కాకుండా బ్రాండ్ అమ్మకాలను పెంచడానికి కంపెనీ వారంటీలను పెంచడం, రోడ్‌సైడ్ అసిస్ట్ వంటి వాటిని కూడా అందిస్తోంది.

## బిగ్ ఐపీఓల సందడి.. వచ్చేవారమే ఎల్‌జీ, టాటా క్యాపిటల్ ఇష్యూలు

దేశీయ ప్రైమరీ మార్కెట్ వచ్చేవారం కళకళలాడనుంది. ఈసారి ఐదు పబ్లిక్ ఇష్యూలు సంయుక్తంగా రూ.28,500 కోట్లు మార్కెట్ నుంచి సమీకరించనున్నాయి. ఇందులో టాటా క్యాపిటల్, ఎల్‌జీ ఎలక్ట్రానిక్స్ ఇండియా వంటి రెండు బిగ్ ఐపీఓలు కూడా ఉన్నాయి. సాధారణంగా ఒకే వారంలో రెండు పెద్ద ఐపీఓలు సబ్‌స్క్రిప్షన్‌కు రావడం అరుదు. అలాంటిది రెండు పేరు మోసిన కంపెనీలు ఒకేవారం సబ్‌స్క్రిప్షన్‌కు వస్తుండడం ఇన్వెస్టర్ల దృష్టిని ఆకర్షిస్తున్నాయి.టాటా గ్రూపునకు చెందిన ఎన్‌బీఎఫ్‌సీ సంస్థ టాటా క్యాపిటల్ పబ్లిక్ ఇష్యూ అక్టోబర్ 6న ప్రారంభం కానుంది. 8న ముగియనుంది. మొత్తం రూ.15,512 కోట్లు మార్కెట్ నుంచి సమీకరించనుంది. ఈ ఏడాదిలో వస్తున్న అతిపెద్ద ఐపీఓల్లో ఇదీ ఒకటి. ఒక్కో షేరు ధరల శ్రేణిని రూ.310-326గా నిర్ణయించింది. టాటా గ్రూపునకు ఉన్న విశ్వసనీయత, బలమైన రిటైల్, కార్పొరేట్ పోర్ట్‌ఫోలియో కారణంగా దీనిపై పెద్దఎత్తున మదుపర్లు దృష్టిసారించే అవకాశం ఉందని అనలిస్టులు భావిస్తున్నారు.టాటా క్యాపిటల్ ఐపీఓ.. పూర్తి వివరాలు 10 పాయింట్లలోఎప్పటినుంచో ఐపీఓ సన్నాహాల్లో ఉన్న మరో సంస్థ ఎల్‌జీ ఎలక్ట్రానిక్స్ ఇండియా. దక్షిణకొరియాకు చెందిన ఎల్‌జీ అనుబంధంగా ఉన్న ఈ సంస్థ.. దేశీయ కన్జ్యూమర్ ఎలక్ట్రానిక్స్ విభాగంలో అతిపెద్ద మార్కెట్ వాటా కలిగిఉంది. పబ్లిక్ ఇష్యూలో భాగంగా రూ.11,607 కోట్లు మార్కెట్ నుంచి సమీకరించనుంది.

## అనుబంధ కంపెనీని అమ్మేస్తున్న గూగుల్!



టెక్నాలజీ దిగ్గజం గూగుల్ మాతృ సంస్థ ఆల్ఫాబెట్ తన లైఫ్ సైన్సెస్ యూనిట్ 'వెరిలీ'ని వదిలించుకోవడానికి సిద్ధమైంది. వెరిలీని సాంకేతికంగా విడదీయడానికి ఆల్ఫాబెట్ గత రెండేళ్లుగా పనిచేస్తోందని, ఇందులో భాగంగా దాన్ని విక్రయించడమో లేదా విడిపడి వేరే సంస్థగా ఏర్పాటు చేయడమో జరుగుతుందని కంపెనీ సీనియర్ ఎగ్జిక్యూటివ్ తెలిపారు. గూగుల్ చట్టవిరుద్ధంగా ప్రకటనల సాంకేతికతను గుత్తాధిపత్యం చేసిందన్న ఆరోపణలకు సంబంధించిన కేసులో ప్రతివాది సాక్షిగా హాజరైన గూగుల్ సెక్యూరిటీ ఇంజనీరింగ్ వైస్ ప్రెసిడెంట్ హీథర్ అడ్కిన్స్ వెరిలీ ప్రణాళికలను వివరించారు. వర్జీనియాలోని ఫెడరల్ కోర్టులో అడ్కిన్స్ మాట్లాడుతూ.. ఆల్ఫాబెట్ గొడుగు కింద గూగుల్‌కు సోదరి సంస్థగా ఉన్న వెరిలీ గత రెండున్నర సంవత్సరాలుగా గూగుల్ సొంత మౌలిక సదుపాయాల నుండి బయటపడటానికి, గూగుల్ క్లౌడ్ ప్లాట్‌ఫామ్‌లోకి వెళ్లడానికి కృషి చేస్తోందన్నారు. "మేము వారిని (వెరిలీ) స్వతంత్ర సంస్థగా మార్చడానికి సహాయపడే ప్రక్రియలో ఉన్నాము" అని ఆమె యూనిట్ గురించి చెప్పారు. అది అమ్మకం లేదా స్పిన్ ఆఫ్ ద్వారా కావచ్చు అన్నారు. "ఇది (వెరిలీ) ఇకపై ఆల్ఫాబెట్ సంస్థగా ఉండకూడదన్నదే ఆలోచన" అని పేర్కొన్నారు.

**వెరిలీ గురించి..**

వెరిలీ అనేది గూగుల్ మాతృ సంస్థ ఆల్ఫాబెట్‌కి చెందిన ఒక లైఫ్ సైన్సెస్ విభాగం. ఇది ఆరోగ్య పరిశోధన, ప్రెసిషన్ మెడిసిన్, డేటా ఆధారిత హెల్త్‌కేర్ పరిష్కారాలను అభివృద్ధి చేయడంలో నిమగ్నమై ఉంది. వెరిలీ (మునుపటి పేరు గూగుల్ లైఫ్ సైన్స్ సర్వీస్) 2015 డిసెంబర్‌లో ఏర్పాటైంది. ఆల్ఫాబెట్ ఏర్పాటైన తర్వాత, గూగుల్ లైఫ్ సైన్సెస్ నుంచి వెరిలీ పేరుతో విడిపోయింది.

## సిట్రోయెన్ కొత్త కారు

సిట్రోయెన్ ఇండియా.. దేశీయ మార్కెట్లో 'ఎయిర్‌క్రాస్ ఎక్స్' లాంచ్ చేసింది. ఈ కారు ధరలు రూ. 8.29 లక్షల నుంచి ప్రారంభమై రూ. 13.69 లక్షల (ఎక్స్-షోరూమ్) వరకు ఉన్నాయి. కంపెనీ ఈ లేటెస్ట్ మోడల్ కోసం బుకింగ్స్ స్వీకరించడం ప్రారంభించింది. డెలివరీలు త్వరలోనే ప్రారంభమవుతాయి. కొత్త డీప్ ఫారెస్ట్ గ్రీన్ రంగులో కనిపించే ఈ కొత్త సిట్రోయెన్ ఎయిర్‌క్రాస్ ఎక్స్.. ఎంట్రీ & పుష్ స్టార్ట్ బటన్, క్రూయిజ్ కంట్రోల్, స్పీడ్ లిమిటర్, ఆటో ఐఆర్వీఎం, ఎల్ఈడీ ప్రొజెక్టర్ ఫాగ్ లాంప్స్, వెంటిలేటెడ్ సీట్లు, 360-డిగ్రీ కెమెరా వంటి వాటితో పాటు 10.25 ఇంచెస్ ఇన్ఫోటైన్‌మెంట్ డిస్‌ప్లే, 7 ఇంచెస్ డిజిటల్ ఇన్స్ట్రుమెంట్ క్లస్టర్ కూడా పొందుతుంది. లేటెస్ట్ డిజైన్, ఫీచర్స్ కలిగిన ఈ ఫ్రెంచ్ బ్రాండ్ కారు.. సేఫ్టీలో 5 స్టార్ రేటింగ్ సాధించింది. కాబట్టి ఇందులో ఆరు ఎయిర్‌బ్యాగులు, ఎలక్ట్రానిక్ స్టెబిలిటీ కంట్రోల్, హిల్ హోల్డ్ అసిస్ట్, ఏబీఎస్ విత్ ఈబీడీ, రియర్ పార్కింగ్ సెన్సార్లు మొదలైన సేఫ్టీ ఫీచర్స్ ఈ కారులో ఉన్నాయి. ఇంజిన్ విషయానికి వస్తే.. కొత్త సిట్రోయెన్ ఎయిర్‌క్రాస్ ఎక్స్ 1.2 లీటర్ నేచురల్లీ ఆస్పిరేటెడ్ పెట్రోల్ & 1.2-లీటర్ టర్బో పెట్రోల్ ఇంజిన్ ఆప్షన్స్ ఉన్నాయి. మొదటి ఇంజిన్ మాన్యువల్ ట్రాన్స్‌మిషన్ ఎంపికను మాత్రమే పొందుతుంది. రెండోది మాన్యువల్ ట్రాన్స్‌మిషన్‌తో పాటు ఆటోమేటిక్ ట్రాన్స్‌మిషన్‌ను పొందుతుంది.





## క్యాష్ ఆన్ డెలివరీకి అదనపు ఛార్జీలు.. కేంద్రం సీరియస్


ఈ మధ్య ఆన్‌లైన్ షాపింగ్‌కు గిరాకీ పెరుగుతోంది. ఇలా కొనుగోలు చేసే వస్తువులకు ఆన్‌లైన్ పేమెంట్‌తో పాటు క్యాష్ ఆన్ డెలివరీ సదుపాయం కూడా ఉంటుంది. అయితే, ఇటీవల కొన్ని ఈ-కామర్స్ సంస్థలు క్యాష్ ఆన్ డెలివరీలకు అదనపు ఛార్జీలు వసూలు చేస్తున్నట్లు ఫిర్యాదులు వెల్లువెత్తాయి. దీంతో కేంద్రం ఆగ్రహించింది. అలాంటి సంస్థలపై దర్యాప్తు ప్రారంభించినట్లు కేంద్ర వినియోగదారుల వ్యవహారాల మంత్రి ప్రహ్లాద్ జోషీ వెల్లడించారు. ఈ-కామర్స్ సంస్థలు వసూలు చేస్తోన్న ఛార్జీలపై ఓ యూజర్ సామాజిక మాధ్యమాల వేదికగా ఓ పోస్ట్ చేశారు. "వర్షాల సమయంలో ఫుడ్ డెలివరీ యాప్‌లు విధించే ఫీజులను పక్కనబెట్టండి. ఈ-కామర్స్ వేదికలు మరో షాకిస్తున్నాయి. ఆఫర్ హ్యాండ్లింగ్ ఫీజు (కంపెనీ ప్రకటించిన డిస్కౌంట్లకు), పేమెంట్ హ్యాండ్లింగ్ ఫీజు, ప్రొటెక్ట్ ప్రామిస్ ఫీజు అంటూ ఏవేవో ఛార్జీలు వసూలుచేస్తున్నాయి. ఇకపై యాప్ స్క్రోల్ చేస్తున్నందుకు కూడా ఫీజులేస్తారేమో" అంటూ సదరు నెటిజన్ ఆగ్రహం వ్యక్తంచేశారు.

**ఫ్లిప్‌కార్ట్ నుంచి మరోసేల్**

ఈ పోస్ట్‌కు కేంద్రమంత్రి ప్రహ్లాద్ జోషీ స్పందించారు. "క్యాష్ ఆన్ డెలివరీ (%ఝుంష్త్ర-ాఅ-ఐవశ్రీఅజవతీఎ%) ఆప్షన్ ఉపయోగించుకున్నప్పుడు కొన్ని ఈ-కామర్స్ ప్లాట్‌ఫామ్‌లు అదనపు ఛార్జీలు వసూలు చేస్తున్నట్లు వినియోగదారుల వ్యవహారాల విభాగానికి ఫిర్యాదులు వచ్చాయి. ఇది వినియోగదారులను తప్పుదోవ పట్టించి, దోపిడీ చేసే చీకటి విధానమే. దీనిపై ఇప్పటికే దర్యాప్తును ప్రారంభించాం. అలాంటి ప్లాట్‌ఫామ్‌లను గుర్తించి వాటిపై కఠిన చర్యలు తీసుకుంటాం. భారత్‌లో వేగంగా విస్తరిస్తోన్న ఈ-కామర్స్ రంగంలో పారదర్శకత, న్యాయమైన విధానాలను కొనసాగించేందుకు కేంద్రం కృతనిశ్చయంతో ఉంది" అని కేంద్రమంత్రి వెల్లడించారు.

జాతీయ దిన పత్రిక
తొలివెలుగు
మన భాష.. మన పత్రిక..





## ప్రభాస్ పై హీరోయిన్ సంచలన కామెంట్స్.. అలా చేస్తాడంటూ..

రెబల్ స్టార్ ప్రభాస్ గురించి ఎంత చెప్పుకున్నా తక్కువే. ప్రజెంట్ వరుస సినిమాలతో ఫుల్ బిజీగా ఉంటున్నాడు ఆ పాన్ ఇండియా స్టార్. ఇక ప్రభాస్ సినిమాల్లో ఫుడ్ గురించే ఆ అందరూ మాట్లాడుకుంటారు. తన సినిమా షూటింగ్ కు వచ్చే ఆర్టిస్టులకు స్పెషల్ గా భోజనాలు పంపించడం తన పెదనాన్న కృష్ణంరాజు నుంచే నేర్చుకున్నాడు ప్రభాస్. ఎంతైనా రాజుల ఫ్యామిలీ కదా.. అందుకే మర్యాదలకు ఏ మాత్రం తక్కువ కాకుండా చూసుకుంటాడు. ఇప్పటికే ఎంతో మంది ఈ విషయాలను తెలిపారు. తాజాగా హీరోయిన్ దిశా పటానీ ఒక ఆసక్తికర విషయం వెల్లడించింది. దిశా పటానీ మాట్లాడుతూ "కల్కి 2898 మొదటి పార్ట్ షూటింగ్ సమయంలో ప్రభాస్ చాలా కేర్ తీసుకున్నాడు.దప్రతీరోజు తన ఇంటి నుంచి పెద్ద ఎత్తున ఫుడ్ క్యారేజీలు పంపించేవాడు. అంత మంచి ఫుడ్ చూస్తే ఎవరు కంట్రోల్ అవుతారు.. అందుకే నేను కూడా ఆ ఫుడ్ ను ఇష్టంగా తినేసేదాన్ని. ఆ వంటకాల వల్ల నా డైట్ పూర్తిగా చెడిపోయింది," అంటూ నవ్వుతూ ఓ ఇంటర్వ్యూలో చెప్పింది. ప్రభాస్ తన కో-స్టార్స్‌కి ఫుడ్ పంపడం కొత్త విషయం కాదు. గతంలో కూడా ఆయనతో పనిచేసిన అనుష్క, శ్రద్ధా కపూర్, పూజా హెగ్డే వంటి హీరోయిన్లకు ఇలాంటి ఫుడ్స్ పంపించేవాడు. సదరు హీరోయిన్లు కూడా ఇదంతా ప్రభాస్ పంపించిన ఫుడ్ అని ఎన్నో వీడియోలు చేశారు. ఆ మధ్య శృతిహాసన్ కూడా సలార్ షూటింగ్ లో ప్రభాస్ పంపించిన ఫుడ్స్ గురించి వీడియో తీయగా సోషల్ మీడియాలో బాగా వైరల్ అయింది.

## నచ్చిన వాళ్లతో శృంగారం చేస్తే తప్పేంటి..

బాలీవుడ్ సీనియర్ నటి మలైకా అరోరా మరోసారి వార్తల్లో నిలిచింది. 50 ఏళ్ల వయసులో కూడా ఫిట్‌నెస్, ఫ్యాషన్, బ్యూటీ పరంగా ఎప్పుడూ స్పాట్‌లైట్‌లో ఉండే ఈ బోల్డ్ బ్యూటీ.. తాజాగా ఒక ఇంటర్వ్యూలో చేసిన వ్యాఖ్యలతో సోషల్ మీడియాలో పెద్ద చర్చకు దారి తీసింది. మనకు తెలిసిందే కదా.. ఆమె తన కంటే 13 ఏళ్లు చిన్నవాడైన అర్జున్ కపూర్ తో డేటింగ్ చేసింది. ఈ మధ్య వీరిద్దరూ పెద్దగా బయటకు కనిపించట్లేదు. అయితే తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న ఈమె షాకింగ్ కామెంట్స్ చేసింది. వ్యక్తిగత జీవితం, సంబంధాల గురించి ఈమెకు ప్రశ్న ఎదురైంది. ఆమె మాట్లాడుతూ, "ప్రతి వ్యక్తికీ తన జీవితాన్ని తన ఇష్టానుసారం గడపడానికి హక్కు ఉంది. మనసుకు నచ్చిన వ్యక్తితో శృంగారం చేయడంలో తప్పు లేదు. దానికి పెళ్లి కావాల్సిన అవసరం లేదు. ఇక్కడ స్వేచ్ఛగా జీవించడం చాలా ముఖ్యం" అని చెప్పింది. ఈ వ్యాఖ్యలపై నానా రచ్చ జరుగుతోంది. కొందరు ఆమె అభిప్రాయాన్ని వ్యక్తిగత స్వేచ్ఛగా చూస్తుండగా, మరికొందరు ఇలాంటి వ్యాఖ్యలు పబ్లిక్‌గా చేయడం తగదని విమర్శిస్తున్నారు.





## బుల్లెట్ సునీల్

అతను మాజీ మోటోక్రాస్ రేసర్ సునీల్. 'బుల్లెట్ సునీల్'గా అందరికి సుపరిచితుడు. 18 ఇండియన్ ఛాంపియన్స్, 57 సౌత్‌జోన్ టైటిల్స్, 100కుపైగా రేస్ విజయాలతో అద్భుతమైన ట్రాక్ రికార్డ్ అతని సొంతం. అయినా అతడి ప్రయాణం ఆగిపోలేదు. 'ఇండియన్ రేసర్లంటే ఓడిపోయేవాళ్లే' అనే అపవాదు అతన్ని స్థిమితంగా ఉండనివ్వ లేదు. రేసింగ్ సర్క్యూట్‌లో భారతదేశాన్ని సగర్వంగా నిలబెట్టాలని అనుకుంటాడు. మరి అతని ప్రయత్నాలు ఎంత వరకు ఫలించాయో తెలుసుకోవాలంటే 'బైకర్' సినిమా చూడాల్సిందే అంటున్నారు మేకర్స్. శర్వానంద్ కథానాయకుడిగా నటిస్తున్న ఈ స్పోర్ట్స్ ఫ్యామిలీ డ్రామాలో సీనియర్ నటుడు రాజశేఖర్ బుల్లెట్ సునీల్‌గా పవర్‌ఫుల్ పాత్రను పోషిస్తున్నారు. బుధవారం రాజశేఖర్ పుట్టిన రోజుని పురస్కరించుకొని ఆయన ఫస్ట్‌గ్లింప్స్‌ను విడుదల చేశారు. ఇందులో రాజశేఖర్ ఇంటెన్స్ లుక్‌తో కనిపిస్తున్నారు. రాజశేఖర్ పాత్ర కథాగమనంలో కీలకంగా ఉంటుందని చిత్రబృందం చెబుతున్నది. బైక్ రేసింగ్ నేపథ్యంలో మూడు తరాల కలల్ని ఆవిష్కరించే కథ ఇదని దర్శకుడు తెలిపారు. ఏప్రిల్ 3న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకురానుంది. మాళవిక నాయర్, బ్రహ్మాజీ, అతుల్ కులకర్ణి తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: జిబ్రాన్, నిర్మాతలు: వంశీ-ప్రమోద్, రచన-దర్శకత్వం: అభిలాష్ రెడ్డి కంకర.

## కమల్‌హాసన్ నిర్మాణంలో రజనీకాంత్ 173వ చిత్రం

'కూలీ' చిత్రంతో భారీ విజయాన్ని అందుకున్న సూపర్‌స్టార్ రజనీకాంత్ తన తదుపరి చిత్రానికి సిద్ధమవుతున్నారు. బుధవారం ఈ సినిమా తాలూకు అధికారిక ప్రకటన వెలువడింది. 'తలైవర్173' వర్కింగ్ టైటిల్‌తో తెరకెక్కనున్న ఈ చిత్రానికి సుందర్ సి దర్శకత్వం వహిస్తారు. అరుణాచలం' (1997) తర్వాత రజనీకాంత్-సుందర్ సి కాంబినేషన్‌లో రాబోతున్న చిత్రమిదే కావడం విశేషం. రాజ్‌కమల్ ఫిల్మ్స్ ఇంటర్నేషనల్ పతాకంపై కమల్‌హాసన్, ఆర్.మహేంద్రన్ నిర్మించనున్నారు. లెజెండరీ నటులైన రజనీకాంత్-కమల్‌హాసన్ మధ్య ఉన్న దశాబ్దాల స్నేహాన్ని, సహోదర బంధాన్ని సెలబ్రేట్ చేసుకునేలా ఈ సినిమా ఉండబోతున్నదని, 2027 సంక్రాంతి కానుకగా ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తామని మేకర్స్ తెలిపారు.

